శిథిలావస్థలో నల్లూర్ తూం

- పడిన బుంగ
- పట్టించుకోని అధికారులు



తూం వద్ద పడిన బుంగ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ చెరువులకు, ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే తూం శిథిలావస్థకు చేరింది. తూం కట్టపై బుంగ పడింది. దీంతో కట్టకు గండి పడే ప్రమాదం పొంచి ఉంది. గండి పడితే నీరు అంతా చెరువులోకి పోతుంది. దీంతో లక్ష్మి కాలువ ద్వారా నీటి సరఫరా జరగదు. ప్రాజెక్ట్ నుంచి 200 మీటర్ల దూరంలో లక్ష్మి ప్రధాన కాలువ నుంచి నల్లూర్ చెరువులోకి నీరు వెళ్లుట కోసం కాలువ నిర్మాణ కాలంలో తూం నిర్మించారు. గ్రామస్తులు కాలువకు తూంను స్వంతంగా ఏర్పాటు చేసుకున్నారు. సరైన ఎత్తులో తూంను నిర్మించకపోవడంతో కాలువలో బండరాళ్లను అడ్డుకట్ట వేసుకుని నీటిని మళ్లీంచుకుంటున్నారు. దీంతో నీరు ఎక్కువ నిలిచి తూం పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే సమయంలో గండి పడితే ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం కలుగుతుంది. లక్ష్మి కాలువ ఆధునీకీకరణ కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.17 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు.లక్ష్మి ప్రధాన కాలువ ద్వారా మరో నాలుగు ఉప కాలువలకు నీరు అందించాలి. ప్రధాన కాలువ కట్టకే గండి పడితే నీరు వృథాగా వెళ్లే అవకాశం ఉంది. కాలువ కట్టకు గండిపడక ముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కాలువలో అడ్డుకట్టలా వేసిన బండరాళ్లు



శిథిలావస్థకు చేరిన నల్లూర్ గ్రామ చెరువు తూం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

తూం వద్ద మరమ్మత్తులు చేపడుతాం. గ్రామస్తులు కాలువకు తూంను స్వంతంగా ఏర్పాటు చేసుకున్నారు. ఆధునికీకరణలో పనులు చేపట్టడానికి వీలు లేదు. అందుకు నిధులు కేటాయించినా మరమ్మతులు చేపట్టడం లేదు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– సురేశ్, డిప్యూటీఈఈ, మైనర్ ఇరిగేషన్ , బాల్కొండ

క్లుప్తంగా

గుంతల పూడ్చివేత



మోర్తాడ్: మోర్తాడ్‌లోని బీసీ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో గుంతలలో వర్షపు నీరు నిలిచి విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి అడ్డంకులు ఎదురయ్యాయి. ఈ సమస్యను పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి గుంతలను పూడ్చించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. డీసీసీ కార్యదర్శి గిర్మాజి గోపి, వీడీసీ చైర్మన్ మోతె సుభాష్, నాయకులు కురుమ నరేశ్, అశోక్, నజీర్, రామకృష్ణలు శనివారం మొరం పోయించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులు అందించారు. ఆరుగురు బాధితులకు మంజూరైన రూ. లక్ష ఇరవై రెండు వేల చెక్కులను వేల్పూర్ మార్కెట కమిటీ డైరెక్టర్ జైడి రవి అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారెడ్డి, చిన్నారెడ్డి, బద్దం సాగర్‌రెడ్డి, లక్ష్మణ్, మహిపాల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల జాయింట్ సర్వే



వర్ని (మోస్రా): మోస్రా శివారులో వివాదాస్పద భూమి 952 సర్వేనంబర్‌లో శనివారం అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. సదరు భూమిలో ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా కబ్జాలో ఉన్నారా, సర్వే నంబర్లు ఉన్న భూమి పూర్తిగా అటవీ రెవెన్యూ శాఖల ఆధీనంలో ఉందా అన్న విషయాన్ని సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తహసీల్దార్ రాజశేఖర్ వెల్లడించారు.

ప్రొసీడింగ్ అందజేత..



బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో సర్వ సంఘ భవన నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి రూ. 7 లక్షల ప్రొసిడింగ్ కాపీని అందజేశారు. ఈసందర్భంగా సర్వ సంఘ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రహరీకి గేట్లు ఏర్పాటు చేయాలని వినతి

ఆర్మూర్‌టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో ఉత్తరంవైపు నిర్మిస్తున్న ప్రహరీకి రెండు వైపులా నడకదారి గేట్లు (వాక్‌వే) ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్‌కు విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యమాద్రిభాస్కర్ వినతి పత్రం అందజేశారు. ప్రహరీకి ఆనుకొని హౌసింగ్‌బోర్డు, మహాలక్ష్మీ కాలనీ, విద్యానగర్, పెర్కిట్‌తో పాటు పలు కళాశాలలు, పాఠశాలలు, ఆస్పత్రిలు ఉన్నాయని, ప్రహరీకి రెండు చోట్ల బస్టాండ్‌లోనికి వెళ్లేందుకు గేట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

రుద్రూర్: పోతంగల్ మండలంలోని కొడిచర్ల శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను శుక్రవారం రాత్రి పోలీసులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాత్రివేళ ఐదు ప్రాంతాల్లో ఇసుక డంప్‌లు స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

నేటి చిత్రం



గుంతల రోడ్డుతో ఇబ్బందులు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీకి వెళ్లే సీసీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వర్షం కురిసినపుడు గుంతలలో నీరుచేరి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. –పిస్క కుశాల్, అయిలాపూర్

మాకు ఫొటో పంపండి – మీ ప్రాంతంలో నెలకొన్న సమస్యను, ఫొటోను మాకు వాట్సాప్‌లో పంపించండి. ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాము. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాము.

ఆర్మూర్: 90102 44405 | బాల్కొండ: 96666 49049 | బోధన్: 99636 95349

15 ఏళ్లుగా ఇన్‌చార్జి ఈవోలే

- పోచంపాడ్ శివాలయం, రామాలయాల పరిస్థితి
- కుంటు పడుతున్న అభివృద్ధి
- పట్టించుకోని పాలకులు



శివాలయంలో ఎండోమెంట్ ఈవో కార్యాలయం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్(శ్రీరాంసాగర్ కాలనీ)లో గోదావరి ఒడ్డున గల శ్రీ రామాలింగేశ్వర, కోదండ రామాలయాలు దేవాదాయశాఖ పరిధిలో ఉన్నాయి. రెండు ఆలయాలకు వేర్వేరుగా దేవాదాయశాఖ కార్యదర్శులు ఉండాలి. రెండు ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉండటంతో రెండు దేవాలయాలకు కలిపి ఒక్కరే ఈవో పని చేస్తున్నారు. గత పదిహేను ఏళ్లుగా ఇన్‌చార్జిలను కొనసాగిస్తున్నారు. పూర్తి స్థాయి కార్యదర్శులను ఇప్పటి వరకు నియమించలేదు. ప్రస్తుతం జెండా బాలాజీ ఆలయ ఈవో వేణు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆలయాల అభివృద్ధి కుంటుపడుతోంది. గోదావరి తీరాన ఉండటంతో శుక్ర, సోమవారాల్లో గోదావరిస్నానాలకు వచ్చే భక్తులు ఇక్కడ తప్పకుండా పూజలు చేస్తారు. ఆలయాల ప్రాంగణాల్లో కుక్కలు, పందులు సంచరిస్తున్నా పట్టించుకోవడం లేదు. రెండు ఆలయాలకు ఇప్పటి వరకు పాలక వర్గాలను నియమించలేదు. పాలకులు పట్టించుకుని పూర్తి స్థాయి కార్యదర్శులను నియమించాలని భక్తులు కోరుతున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హర్షం



ఆలూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



సాలూర మండల కేంద్రంలో స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

పెర్కిట్/బోధన్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రి వర్గ ఆమోదం తెలుపడంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆలూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్ మాట్లాడారు.బోధన్ డివిజన్ లోని సాలూర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మందర్నా రవి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లే రమేష్, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, శివాలయం కమిటీ చైర్మన్ లోకప్పగారి లక్ష్మణ్ పటేల్, నాయకులు డేగ పోశెట్టి, వైస్ మల్లారెడ్డి, నవనీత్, సంజీవ్, గంగా రెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కే ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఎండీఎం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన రూ.10 వేల గౌరవ వేతనం హామీని అమలు చేయాలని, కార్మికులు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎండీఎం కార్మికుల సంఘం మండల కార్యదర్శి జక్కం సుజాత, విజయమ్మ, భవిత, దేవాయి, రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నిలయం..గ్రంథాలయం

- శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న వైనం
- కుద్వాన్‌పూర్‌లో మూడున్నర వేల నవలలు, పుస్తకాలు





కుద్వాన్‌పూర్ గ్రామ చావిడిలో కొనసాగుతున్న శాఖ గ్రంథాలయం

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామం శాఖ గ్రంథాలయం సమస్యలకు నిలయంగా మారింది. గ్రామంలో 60 నుంచి 70 సంవత్సరాల క్రితం గ్రంథాలయం ఏర్పడింది. రికార్డుల్లో మాత్రం 1983 నుంచి మాత్రమే అందుబాటులో ఉంది. అద్దె భవనంలో కొనసాగిన శాఖ గ్రంథాలయం కొన్నాళ్ల నుంచి గ్రామపంచాయతీ ఆవరణలోని చావిడిలో (పెంకుటిళ్లు)లో కొనసాగుతుంది. రూ.100 రుసుం చెల్లించి 103 మంది గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్నవారున్నారు. గ్రంథాలయంలో 3404 వివిధ రకాల నవలలు, పుస్తకాలు ఉన్నాయి.

తడిసిపోతున్న పుస్తకాలు

జీపీ ఆవరణలోని చావిడి (పెంకుటిళ్లు)లో నిర్వహిస్తున్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షకాలం కురిసినపుడు పైకప్పు ఊరుస్తుంది. దీంతో పుస్తకాలు, నవలలు తడిసిపోతున్నాయి. గ్రంథాలయానికి గ్రంథపాలకుడు లేకపోవడంతో స్వీపర్ గ్రంథాలయ నిర్వహణ, రికార్డుల నమోదు తదితర విధులు చేస్తున్నాడు.

అధ్యాత్మికం

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



బోధన్ : పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వర కాలనీలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారి శ్రవణా నక్షత్ర యుక్త మాస కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని సాటాపూర్ గ్రామస్తులు అబ్బగోని లక్ష్మి నర్సయ్య గౌడ్, కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కల్యాణ కార్యక్రమంలో స్థానిక గోవర్ధనం చంద్రప్రకాశ్-ఆండాళ్,గాదె వెంకటరమణా-దుర్గా రాజ్యలక్ష్మి, కుందనం రమేష్‌చారి-లహరి, సతీష్‌గౌడ్- మహేశ్వరి, అల్లూరి వెంకటేశ్వర్‌రావు-ప్రశాంతి దంపతులు, వేదపండితులు శ్రీధరాచార్యులు, ఆలయ పూజారి దీపక్‌పాండే, కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు రుద్రూర్‌లో బోనాల పండుగ



రుద్రూర్ : రుద్రూ ర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే బోనాల పండుగకు గ్రామ పెద్దలు, కుల సంఘాల సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రో ఇండ్రస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు ప్రత్యేక అతిథులుగా హాజరవుతున్నట్లు గ్రామ పెద్దలు వెల్లడించారు. పదేళ్ల క్రితం అప్పటి సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్ కృషితో బోనాల పండగ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

జంబి హనుమాన్ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి ప్రతి రోజు సాయంత్రం సంధ్య దీపారాధన నిర్వహిస్తామని, దాతలు నూనె మొదలైన వస్తువులను బహూకరిస్తే వారి గోత్రనామాలతో దీపారాధన చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రేగుల్ల సత్యనారాయణ, డైరెక్టర్ దోండి రమణలు, చిక్కాల నవీన్, నారాయణరెడ్డి, పింజ అభినవ్, తదితర భక్తులు పాల్గొన్నారు.

'గల్ఫ్‌కార్మికులపై మాజీ మంత్రి నిజాలు మాట్లాడాలి'



బాల్కొండ: గల్ఫ్ కార్మికులపై స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిజాలు మాట్లాడాలని గల్ఫ్ కార్మికుల రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యుడు పరికి పండ్ల స్వదేశ్ అన్నారు. శనివారం బాల్కొండలో పలు గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆయన కలిసి మాట్లాడారు. జిల్లాలో గల్ఫ్‌లో మృతి చెందిన 55 మందికి, నియోజక వర్గంలో 9 మందికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందన్నారు. బెహరన్ గల్ఫ్ కార్మికుల అధ్యక్షుడు పెంకుల రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, యూత్ అధ్యక్షులు సంజీవ్‌గౌడ్, అరవింద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన సైఫాన్ నిర్మాణం



నల్లూర్ శివారులో సైఫాన్ నుంచి వెళ్తున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువపై ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారులో నిర్మించిన సైఫాన్ నిర్మాణం పూర్తయింది. లక్ష్మి కాలువ ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన సైఫాన్ నిర్మాణం పనులు గతేడాది క్రితం ప్రారంభించారు. వర్షాలు పనులు నిలిచిపోయాయి. వేసవిలో మళ్లీ పనులను పునః ప్రారంభించారు. సైఫాన్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు సైఫాన్ దాటి నల్లూర్ వైపు సులువుగా వెళ్తున్నాయి. రైతులు కాలువ అవతలి వైపు ఉన్న పంట పొలాలకు వెళ్లడానికి వంతెన కూడా పూర్తయింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో సహపంక్తి భోజనం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేదలో సన్నబియ్యం లబ్ధిదారు గంజోళ్ల ఎల్లయ్య ఇంట్లో శనివారం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సహపంక్తి భోజనం చేశారు. అంతకు ముందు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సందర్శించి బేస్‌మెంట్ బిల్లులను అందజేశారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు ఇసూబ్, ధర్మన్న, తుక్కన్న, దమ్మాయి శ్రీను, గంగయ్య, గాదేశ్రీను, మెండు శ్రీకాంత్, పీరాజీ నాగరాజ్, నవీన్‌గౌడ్, గంగారెడ్డి, చోటు నితిన్, రాజేశ్వర్, లక్కంపల్లి ముత్యం, తోట మహేష్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో హామీలను నెరవేర్చాలి



బోధన్‌లో మాట్లాడుతున్న సుజాత సూర్యవంశి

బోధన్: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌భవన్‌లో ఎమ్మార్పీఎస్‌జిల్లా ప్రతినిధులు, దివ్యాంగులతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సదస్సుకు మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని వెల్లడించారు. సదస్సుకు గ్రామ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లస్సింగారి భూమయ్య మాదిగ, సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం, స్థానిక నాయకులు గంధమాల చంద్రయ్య, తాడెం అబ్బయ్య, కుమార్,రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పోచంపాడ్‌లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చదివే రోజులను గుర్తు చేసుకున్నారు. ఆనందంగా గడిపారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలు

- ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వ కృషి
- ఆర్మూర్ పట్టణంలో 900 మహిళా సంఘాలు



రాంనగర్‌లో సమావేశంలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా వృద్ధిలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల్లో సభ్యత్వం కలిగిన సభ్యులకు వడ్డీ లేని రుణాలను అందజేయనుంది. ఈ నెల 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను మంజూరు చేయనున్నారు. ఈ రుణాల ద్వారా మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహించి, స్వావలంబన దిశగా ముందుకు సాగనున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 399 మహిళా సంఘాలకు రూ. 16,79,093 వడ్డీ లేని రుణాలు మంజూరు కాగా, 2024–25 సంవత్సరానికి 449 మహిళా సంఘాలకు రూ.54,55,009 వడ్డీ లేని రుణాలు ఇవ్వనున్నారు. ప్రస్తుతం, బ్యాంక్ అధికారులు మహిళా సంఘాల ఖాతాలు సక్రమంగా ఉన్నాయా అనే వివరాలు పరిశీలిస్తున్నారు. త్వరలోనే వివిధ సంఘాల ఖాతాల్లో రుణాల డబ్బు జమ చేయనున్నారు. ఆర్మూర్‌లోని మొత్తం 900 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 9,000 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

రుణాలను వినియోగించుకోవాలి

ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు వినియోగించుకోవాలి. మహిళలు చిన్న చిన్న వ్యాపారులు ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. – రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

పిచ్చి మొక్కల్లో శ్రీరాంసాగర్ ఆంగ్ల అక్షరాలు

- రూ. 18లక్షలతో నిర్మాణం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై పర్యాటకులను ఆకర్షించడం కోసం 2010 సంవత్సరంలో ఓఅండ్‌ఎం నిధులతో శ్రీరాంసాగర్ అనే ఆంగ్ల అక్షరాలను రూ. 18 లక్షల ఖర్చు చేసి నిర్మించారు. నిర్మాణ కాలంలో ఒక్కో అక్షరానికి లక్ష రూపాయాలు వెచ్చించినట్లు రికార్డుల్లో నమోదు చేసి బిల్లులు ఎత్తారు. జాతీయ రహదారి 44 గుండా వెళ్లే ప్రయాణికులకు ఎస్సారెస్పీ కనిపించేలా ఈ పాయింట్‌ను నిర్మించారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ అనే ఆంగ్ల అక్షరాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ప్రాజెక్ట్ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని పర్యాటకులు డిమాండ్ చేస్తున్నారు.